

ములుగు పట్టణంలోని శివాలయంలో..



పూల సంబురం మొదలాయే..!



బతుకమ్మలతో యువతులు

'తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తూ.. అతివల ఆనందానికి అద్దం పట్టే బతుకమ్మ సంబురం తొలిరోజే అంబరాన్ని అంటింది. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళామణులు వేడుకలకు తరలివచ్చారు. ఆట పాటలు.. కోలాటాలతో ఆలయాల ప్రాంగణాలు హోరెత్తాయి.. పూల పరిమళాల సుగంధాన్ని వెదజల్లాయి. ముత్తయిదువలు పసుపూ బొట్టూ ఇచ్చిపుచ్చుకుని బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.. ఐక్యతకు చిహ్నంగా నిలిచారు.. ఎంగిలి పూల బతుకమ్మా.. మా జీవితాల్లో వెలుగు పూలు పూయించమ్మా.. పాడి పంటలతో మా లోగిళ్లలో సిరుల పంట పండించమ్మా అంటూ హుషారుగా ఆడిపాడారు.

– న్యూస్‌టుడే, గోవిందరావుపేట

మరిన్ని చిత్రాలు 9లో..





మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న మాజీ జడ్పీచైర్‌పర్సన్ బడే నాగజ్యోతి



వెంకటాపూర్‌లో..



ఏటూరునాగారం బస్టాండు వద్ద



మూడు బతుకమ్మలు చేతబూని వస్తున్న మహిళ

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న పరిశీలకులు

ములుగు, న్యూస్‌టుడే: డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన బుధవారం ములుగులోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. అక్టోబర్ ఒకటి నుంచి 5 వరకు పరిశీలన ప్రారంభం కావాల్సి ఉండగా, అధికారికంగా డీఈవో కార్యాలయానికి 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితా చేరకపోవడంతో బుధవారం నుంచి ప్రారంభించారు. జిల్లా విద్యాశాఖ అధికారి జి. పాణిని పర్యవేక్షణలో ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 12 బృందాలను ఏర్పాటు చేసి ప్రతి బృందంలో ఇద్దరు చొప్పున నియమించి పత్రాలు పరిశీలిస్తున్నారు. ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా పరిశీలన జరుగుతోంది. ధ్రువపత్రాల పరిశీలనకు ప్రత్యేక చెక్ లిస్టు రూపొందించారు. ప్రస్తుతం ఎస్‌జీటీ అభ్యర్థుల ధ్రువపత్రాలు మాత్రమే పరిశీలిస్తున్నారు. జిల్లాలో 1:3 నిష్పత్తిలో 322 మంది ఎంపిక చేయగా, మొత్తం 125 పోస్టులున్నాయి. ప్రక్రియ పూర్తయిన తర్వాత అర్హులు, అనర్హుల జాబితాను ప్రభుత్వానికి నివేదించనున్నారు. మొదటి రోజు 89 మంది ధ్రువపత్రాలను పరిశీలించారు.

చెక్ లిస్టులో పొందుపర్చిన విధంగా..

చెక్ లిస్టులో పొందుపర్చిన విధంగా పత్రాల పరిశీలన సాగుతోంది. ఇందులో స్థానికత ధ్రువపత్రం, డీఎస్సీ హాల్‌టికెట్, పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, డీఈడీ, టెట్ మార్కుల జాబితా, కులం, 1 నుంచి 7వ తరగతి వరకు చదివిన స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, చరవాణి, మెయిల్ ఐడీ తదితర అంశాలను సరిచూస్తున్నారు.

జగన్మాతకు హరిద్రాభిషేకం

రంగంపేట, న్యూస్‌టుడే: జగన్మాత శ్రీభద్రకాళి అమ్మవారికి బుధవారం ఉదయం హరిద్రాభిషేకం, పూర్ణాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో 40 కిలోల స్వచ్ఛమైన హరిద్రా చూర్ణం(పసుపు)తో అమ్మవారికి అభిషేకం చేశారు. హరిద్రామయమైన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. భద్రకాళి శరణం మమః అంటూ ప్రణమిల్లారు. రాత్రి 7 గంటలకు శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రుల అంకురార్పణ పూజలు జరిగాయి. గురువారం ఉదయం అమ్మవారికి పూర్ణాభిషేకం, నవరాత్రి కలశ స్థాపన, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, ధ్వజా రోహణం కార్యక్రమాలు ఉంటాయని ప్రధానార్చకుడు శేషు తెలిపారు.

మంటలు రేపిన మాటలు!





● హస్తం.. గులాబీల మధ్య వేడెక్కిన రాజకీయం

ఓరుగల్లు రాజకీయాలు ఆరోపణలు, ప్రత్యారోపణలతో అట్టుడుకుతున్నాయి. అధికార హస్తం, విపక్ష భారాస మధ్య పంచాయితీ పతాకస్థాయికి చేరుకొంది.. పచ్చ గడ్డి వేస్తే భగ్గుమన్నట్టుగా మాటల యుద్ధం మొదలైంది. దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం రాజధాని హైదరాబాద్‌లో మాజీ మంత్రి, భారాస కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై తీవ్రస్థాయి ఆరోపణలు చేయడం, అంతకు రెండు రోజుల ముందు ఓరుగల్లు అభివృద్ధి పనులపై పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌ల మధ్య జరిగిన గలాటా లాంటి వరుస ఘటనలు ఓరుగల్లులో కలకలం రేపాయి.

–ఈనాడు, వరంగల్

భాజపా నేత, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఇటీవల నూలు దండను బహుమానంగా మంత్రి కొండా సురేఖ మెడలో వేయడం, ఆ తర్వాత నెటిజన్లు దీనిపై ట్రోలింగ్ చేయడం గొడవకు దారి తీసింది. భారాస నేతలే పనిగట్టుకొని ట్రోలింగ్ చేస్తున్నారని, ఈ వ్యవహారం వెనక మాజీ మంత్రి కేటీఆర్ ఉన్నారంటూ సురేఖ విరుచుకుపడ్డారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తూ తెలంగాణ భవన్‌ను ముట్టడించిన కార్యకర్తల్లో వరంగల్‌కు చెందిన వారు ఉన్నారు. మహిళా మంత్రి అని కూడా చూడకుండా గులాబీ నేతలు అభ్యంతరకరంగా పోస్టులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మంత్రి సురేఖకు సంఘీభావం తెలిపారు. ఈ రాజకీయ వివాదంపై జిల్లాకు చెందిన కాంగ్రెస్ కీలక నేతలు మడికొండ ఠాణాలో బుధవారం ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి తదితరులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి వరంగల్ నేతలతో సమావేశమై ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా సమాధానం ఇవ్వాలని సూచించిన నేపథ్యంలో కొండా సురేఖ వర్సెస్ కేటీఆర్ వివాదాన్ని కాంగ్రెస్ శ్రేణులు అంత తేలిగ్గా వదలడం లేదు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నా.. తామంతా ఒక్కటేనని చాటుతూ భారాసపై పదునైన విమర్శలు గుప్పిస్తూ ప్రజల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

నువ్వా.. నేనా..



మరో వైపు పశ్చిమ నియోజకవర్గంలోనూ అధికార విపక్ష పార్టీల మధ్య అభివృద్ధిపై అగ్గిరాజుకుంది. ఇరు పార్టీల కార్యకర్తల తోపులాటలకు దారి తీసింది. ఇటీవల కాళోజీ కళా క్షేత్రం, నయీంనగర్ నాలాపై వంతెన పనులు పూర్తయ్యాయి. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఈ పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించానంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిధులు విడుదల చేయడం వల్లే వీటిని వేగవంతంగా పూర్తి చేయగలిగామని ప్రకటించారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ విమర్శలు గుప్పించారు. ఈ పనులకు ప్రతిపాదనలు, నిధులు భారాస హయాంలోనే కేటాయించామని.. కాంగ్రెస్ సర్కారు అంతా తామే చేసినట్టు ప్రగల్భాలు పలుకుతోందంటూ మండిపడ్డారు. ఈ క్రమంలో నయీంనగర్ నాలా వద్ద చేయి, కారు పార్టీల కార్యకర్తలు బాహాబాహీకి దిగడం సంచలనంగా మారింది.

భారాస నేతలు సిద్ధం..

ఒకవైపు కాంగ్రెస్ మంత్రి కొండా సురేఖకు శ్రేణులు మద్దతిస్తుండగా మరోవైపు కేటీఆర్‌కు మద్దతుగా భారాస ఉమ్మడి జిల్లా నేతలు నిలబడుతున్నారు. కేటీఆర్‌పై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సర్కారు వైఖరిని ఎండగట్టారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై విమర్శలు చేశారు. శ్రీహరి విజయానికి ప్రతి ఒక్క భారాస కార్యకర్త కష్టపడితే ఆయన హస్తం గూటికి చేరడం ప్రజలను మోసం చేయడమే అంటూ మండిపడ్డారు.

నేడు రోడ్డు పనులు ప్రారంభం



మంత్రి సీతక్క పనులు ప్రారంభించనున్న జంగాలపల్లి-బంజెరుపల్లి మార్గం

ములుగు, న్యూస్‌టుడే: సుమారు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ములుగు మండలం జంగాలపల్లి క్రాస్ రోడ్డు 163 జాతీయ రహదారి నుంచి బంజెరుపల్లి వరకు సిమెంటు రోడ్డు పనులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క రహదారి పనులకు గురువారం శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.80 లక్షల వ్యయంతో నిర్మించనున్న మార్గానికి అన్నిరకాల అనుమతులు మంజూరయ్యాయి. మంత్రి సీతక్కతో పాటు పాలనాధికారి టీఎస్.దివాకర, ఈఈ వీరభద్రం, జిల్లా పంచాయతీ అధికారి దారి నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపారు. త్వరలో ప్రారంభించనున్న రహదారికిరువైపులా పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. మంత్రితో పాటు జిల్లా కలెక్టర్, గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ విభాగం ఈఈ, బంజెరుపల్లి, జంగాలపల్లి, సోమల్లపల్లి గ్రామస్థులు ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు.

నియంత్రిక ఏర్పాటు



గోవిందరావుపేట, న్యూస్‌టుడే: గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని హాస్టల్‌గడ్డ ప్రాంతంలో పది రోజుల క్రితం విద్యుత్తు నియంత్రికపై పిడుగు పడి పాడైపోయిందని, రైతుల పంట పొలాలు నీరు లేక ఎండిపోయే పరిస్థితి తలెత్తిందని 'ఈనాడు'లో సోమవారం 'విద్యుత్తు నియంత్రికపై పిడుగుపాటు.. ఎండుతున్న పంటలు..!' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఎన్‌పీడీసీఎల్ డీఈఈ నాగేశ్వర్‌రావు స్పందించి సంబంధిత ఏఈ దేవ్‌సింగ్‌ను సంప్రదించి పాడైపోయిన నియంత్రిక స్థానంలో మరొకటి ఏర్పాటు చేయించారు. సిబ్బంది చీకట్లో శ్రమించి సరఫరాను పునరుద్ధరించడంతో ఆ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఈనాడు కథనానికి స్పందన



పాలంపేట-వెంకటాపూర్ ప్రధాన రహదారిపై పడిన చెట్టు



మంగపేటలో నేలకూలిన చింతచెట్టు

గాలివాన బీభత్సం

వెంకటాపూర్, మంగపేట, ములుగు, న్యూస్‌టుడే: జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు మెరుపులతో పాటు పలు చోట్ల పిడుగులు పడ్డాయి. పది రోజులుగా వానలు కురవలేదు. బుధవారం సాయంత్రం కురిసిన వర్షం రైతులకు కాస్త ఊరటనిచ్చినా భీకరమైన గాలితో రావడంతో పంట పొలాలు కొన్నిచోట్ల నేలకొరిగాయి. మిర్చి చేలల్లోని మల్చింగ్ పేపర్ గాలికి లేచిపోయింది. మంగపేట, వెంకటాపూర్ మండలాల్లో చెట్లు విరిగి పడ్డాయి. వెంకటాపూర్-పాలంపేట ప్రధాన రహదారిపై భారీ చెట్టు పడటంతో.. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ జక్కుల సతీష్ అక్కడకు చేరుకుని జేసీబీ యంత్రాలను సమకూర్చి రవాణాను పునరుద్ధరించారు.



మంగపేటలో తెగి పడిన కరెంటు తీగలు

● మంగపేట మండలంలోని బోరునర్సాపురం, మంగపేట తదితర గ్రామాల్లో కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్తు తీగలు తెగిపోవడంతో ఆయా గ్రామాల్లో సరఫరా నిలిచింది. మంగపేటలోని శ్రీ ఉమాచంద్రశేఖరస్వామి ఆలయం వెనుక ఉన్న వందేళ్ల చింత చెట్టు నేలకూలింది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మంగపేట తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు శాఖ ఏఈ గుర్రాల ప్రశాంత్‌రెడ్డి సిబ్బందితో కరెంటు సరఫరాను పునరుద్ధరించారు.

● ములుగు మండలం మల్లంపల్లిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న భారీ చెట్టుపై అకస్మాత్తుగా పిడుగు పడింది. చెట్టు రెండు భాగాలుగా విడిపోయి ఒక భాగం కింద పడిపోయింది. పరిసరాల్లో ఎవరూ లేకపోవడం ప్రమాదం తప్పింది.



బోరునర్సాపురంలో విరిగిపడ్డ విద్యుత్తు స్తంభం



జిల్లా ఎస్పీ కార్యాలయంలో పూలమాల వేస్తున్న ఎస్పీ శబరీష్

దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు గాంధీ



నివాళులర్పిస్తున్న పాలనాధికారి దివాకర, అధికారులు, వైద్యులు, సిబ్బంది

ములుగు, న్యూస్‌టుడే: శాంతి, అహింస, సత్యాగ్రహం ఆయుధాలుగా సన్మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అని, ఆయన చూపిన మార్గంలో పయనించి దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని జిల్లా పాలనాధికారి టీఎస్.దివాకర అన్నారు. బుధవారం మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహాత్ముడి ఆశయాలు, ఆదర్శాలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం ములుగు జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ములుగు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్‌లాల్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి అల్లం రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పోలీసు అధికారి కార్యాలయంలో ఎస్పీ శబరీష్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

ఏటీఎం చోరీ కేసు ఛేదన

బయ్యారం, న్యూస్‌టుడే: బయ్యారం ఎస్‌బీఐ ఏటీఎం చోరీ కేసును బయ్యారం పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. చోరీకి పాల్పడిన దుండగుల్లో ఒకరిని పట్టుకొని విచారణ కొనసాగిస్తున్నారు. డీఎస్పీ తిరుపతిరావు కథనం ప్రకారం.. బయ్యారం బస్టాండ్ సెంటర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంను ఫిబ్రవరి 18న అంతర్రాష్ట్ర దొంగల ముఠా ధ్వంసం చేసి సుమారు రూ.28 లక్షల నగదు చోరీ చేసి పరారయ్యారు. జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు గార్ల, బయ్యారం సీఐ రవికుమార్ ఈ సంఘటనపై సుమారు 8 నెలలపాటు దర్యాప్తు కొనసాగించి దుండగుల్లో ఒకరిని పట్టుకొని బుధవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్ జిల్లా పలోడి ప్రాంతానికి చెందిన అబ్దుల్ గని మరికొంత మందితో కలిసి ఫిబ్రవరి 18న అర్ధరాత్రి 1.20 గంటల సమయంలో కారులో వచ్చి గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం చోరీకి పాల్పడ్డాడు. ఈ కేసులో గనిని ఏ1 నిందితుడిగా కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు

బహు పౌష్టికం.. బతుకమ్మ ప్రసాదం




పువ్వులతో దేవుడిని పూజిస్తారు.. ఆ పువ్వులనే దేవతలుగా, ఆడబిడ్డలే ఇంటి ఆరాధ్యదేవతగా పూజించే గొప్ప ప్రకృతి పండగ బతుకమ్మ. అనుబంధాలు, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగలో ప్రసాదాలు సైతం ప్రత్యేకతను సంతరించుకుంటాయి. పూలతో తయారుచేసిన రంగు రంగుల బతుకమ్మలను చెరువు గట్టువద్దకు తీసుకెళ్లి ఆడిపాడిన తర్వాత ఆడబిడ్డలు తెచ్చుకున్న ప్రసాదాలు ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుని ఆత్మీయతను పంచుకుంటారు. తొమ్మిది రోజులు రోజుకో తీరు ప్రసాదాలు(సద్దిని) తీసుకెళతారు. తరవి మాస్తే ప్రతి సద్దిలోనూ చిరుధాన్యాలతో తయారు చేసినవి ఉంటాయి. బతుకమ్మకు రోజుకో రకంగా సమర్పించే ప్రసాదాలు.. వాటి ఆరోగ్య ప్రాముఖ్యం గురించి ప్రత్యేక కథనం.

- న్యూస్‌టుడే, కాజీపేట

1 ఎంగిలిపూల బతుకమ్మ

● ప్రసాదం: ఊక(ముడి)బియ్యం, బెల్లం కలిపిన ముద్దలు చేస్తారు.

● ప్రయోజనం: ముడి బియ్యంలో బి కాంప్లెక్సు ఉంటుంది. కొందరు నూకలతో చేస్తారు కాబట్టి త్వరగా జీర్ణం అయ్యే కార్బొహైడ్రేట్స్ అధికంగా ఉంటాయి.

2 అటుకులు..

● సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో పెసర లేదా కందిపప్పును నానబెట్టి దానినే ప్రసాదంగా తీసుకెళతారు. అటుకులనే ప్రధానంగా సద్దిగా తీసుకెళతారు కాబట్టి దీనిని అటుకుల బతుకమ్మ అంటారు.

● పెసరపప్పులో ఎక్కువగా ప్రోటీన్‌లుంటాయి. బెల్లంలో ఐరన్ ఉంటుంది. ఇది బాలికలు, మహిళలకు మేలు చేస్తుంది.

3 ముద్దపప్పు

● ముద్దపప్పు, బెల్లం, పాలతో ప్రసాదం చేసుకుని తీసుకెళతారు.

● ఇందులో బెల్లం ఉంటుంది. మహిళల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. శరీరానికి కావాల్సిన ఐరన్‌ను అందిస్తుందని ప్రముఖ న్యూట్రిషనిస్టు రమాదేవి తెలిపారు.

4 నానబియ్యం

● నానబెట్టిన బియ్యానికి పాలు, బెల్లం కలిపి వండుతారు. ఈ ప్రసాదం వేడిగా ఉండటానికి బతుకమ్మ ఆడటానికి కొద్ది సమయం ముందు తయారు చేసుకుని వెళతారు.

● ఇందులోనూ బెల్లానికి ప్రాధాన్యం ఇస్తారు.

5 అట్ల..

● బియ్యం పిండిని అట్లుగా పోస్తారు. వీటికి కొందరు బెల్లం లేదా చక్కర కలపడం వల్ల తీయగా ఉంటాయి.

● మంచి పోషకాహారం. ఎదుగుదలకు తోడ్పడుతుంది.

6వ రోజు బతుకమ్మ పండగను సెలవు. ఈ రోజు అలిగిన బతుకమ్మగా పిలుస్తారు. అటకు దూరంగా ఉంటారు.

7 వేపకాయల

● సకినాలు చేసే పిండి పదార్థాన్ని చిన్న చిన్న వేపకాయలంత పరిమాణంలో ముద్దలుగా చేసి నూనెలో కాలుస్తారు. ఇవి వేపకాయల్లాగా ఉంటాయి కాబట్టి వేపకాయల బతుకమ్మ అంటారు.

● ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇంట్లో తయారుచేసుకోవచ్చు. శరీరానికి అన్ని రకాల పోషకాలు అందుతాయి.

8 వెన్న ముద్దల

● వెన్నతో తయారు చేసిన నువ్వుల ఉండలను ఫలహారంగా చేస్తారు. వెన్న, నెయ్యి, నువ్వులు శరీరానికి కావాల్సిన ప్రోటీన్, కాల్షియం అందిస్తాయి.

● వెన్న, నెయ్యి పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడుతాయి.

9 సద్దుల బతుకమ్మకు నత్తుపిండి

మొక్కజొన్న గింజలు వేయించి.. వాటిని పొడి చేసి బెల్లం రవ్వలు కలిపిన పిండినే సత్తుపిండి అంటారు. సద్దుల బతుకమ్మ రోజు ఇది చాలా ప్రత్యేకం. సజ్జలలాంటి చిరుధాన్యాలతో సద్ద ముద్దలు చేస్తారు అందుకే దీనిని సద్దుల బతుకమ్మ అంటారు. ఈరోజు సద్దిని(ప్రసాదాలు) ఎక్కువగా తీసుకెళతారు కాబట్టి దీనిని సద్దుల బతుకమ్మ అని కూడా పిలుస్తారు.

● పెరుగన్నం, , చింతపండు పులిహోర, నిమ్మకాయ కొబ్బరి తురుము సద్దులను చేస్తారు. సత్తుపిండి, కొబ్బరి పొడి, నువ్వుల పొడి, మలీద ముద్దలు, పులిహోర, కొబ్బరి తురుము, పండ్లు సమర్పిస్తారు. ఇవన్నీ ఆరోగ్యదాయం..

బతుకమ్మ ప్రసాదం ఆరోగ్యదాయం. వాటిని చిరుధాన్యాలతో తయారుచేయడం వల్ల పోషకాలు మెండుగా ఉంటాయని హనుమకొండకు చెందిన ప్రముఖ న్యూట్రిషనిస్టు జ్ఞానేశ్వర్ తెలిపారు.

మహబూబాబాద్‌లోని వేణుగోపాల స్వామి ఆలయంలో..





హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బుధవారం కొమటిపల్లి క్రీడా మైదానంలో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 49.3 ఓవర్లలో 192 పరుగులు చేసింది. విష్ణుక్ 55, అఫ్రిది 35 పరుగులతో రాణించారు. వేదనలో నిజామాబాద్ జట్టు 30 ఓవర్లలో 74 పరుగులకే కుప్పకూలింది. 118 పరుగుల భారీ తేడాతో కరీంనగర్ జట్టు విజయం సాధించింది. మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆదిలాబాద్‌పై ఖమ్మం జట్టు గెలుపొందింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిలాబాద్ జట్టు 29.3 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 109 పరుగులు చేసింది. ఖమ్మం జట్టు 30.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. గురువారం కొమటిపల్లి మైదానంలో ఖమ్మం, నిజామాబాద్: మొగిలిచర్ల మైదానంలో ఆదిలాబాద్, కరీంనగర్ జట్ల మధ్య మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

జీఎన్ఎం కోర్సులో ప్రవేశానికి ప్రకటన

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలోని నర్సింగ్ స్కూల్‌లో జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ(జీఎన్ఎం)లో మూడేళ్ల కోర్సులో చేరేందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) ప్రకటన జారీ చేసింది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 1వ తేదీ నుంచి 17 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈ నెల 29న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. వివరాలకు http://dme.telangana.gov.in వెబ్‌సైట్ చూడాలన్నారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక.. మంత్రి చేయూత



ఈనాడు కథనానికి స్పందన

పలిమెల, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతి పారా అథ్లెటిక్స్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. డిసెంబరులో కంబోడియా దేశంలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు తమకు రూ.లక్ష అవసరమవుతోందని, తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో నగదు సమకూర్చడం వారికి భారంగా మారింది. ఈ నేపథ్యంలో 'అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడలకు ఎంపిక.. అడ్డంకిగా మారిన పేదరికం' అనే శీర్షికతో మంళవారం ఈనాడులో ప్రచురితమైన కథనానికి బుధవారం కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు దండెర రాజేందర్ స్పందించారు. మహాదేవపూర్ మండల పర్యటనకు వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు యువతి సమస్యను వివరించారు. నగదు సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ శర్మను ఆదేశించారు. మంత్రి యువతిని సన్మానించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి దేశానికి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు.

భద్రకాళి.. నమోః నమామి!



రంగంపేట, న్యూస్‌టుడే: వేదవ్యాసుడు రచించిన శ్రీదేవీ భాగవతం ప్రకారం నవరాత్రులు దేవీ ఆరాధనకు ప్రత్యేకమైనవి. విజయదశమి సందర్భంగా శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తారు. జగన్మాత నవరాత్రుల్లో తొమ్మిది రూపాలుగా దర్శనమిస్తుంది. అమ్మవారికి ఏరోజు ఏం ప్రసాదం, ఏ చీర సమర్పించినందే దేవీ భాగవతంలో పొందుపర్చారు. భద్రకాళి ఆలయంతో పాటు ఉమ్మడి జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అవతారాలు.. అలంకరణ

మొదటిరోజు: బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారు. ఈ రోజు అమ్మవారికి లేత గులాబీ రంగు వస్త్రాన్ని సమర్పిస్తారు. క్షీరాన్నం నైవేద్యం.

2వ: అమ్మవారు వేదమాత శ్రీగాయత్రి దేవిగా దర్శనమిస్తారు. నారింజ రంగు వస్త్రం, కొబ్బరి అన్నం నివేదిస్తారు.

3వ: అమ్మవారు ప్రాణకోటి ఆకలి తీర్చే అన్నపూర్ణ మాతగా దర్శనమిస్తారు. పసుపురంగు వస్త్రం, అల్లం గారెలు సమర్పిస్తారు.

4వ: శ్రీలలితా మహాత్రిపుర సుందరీదేవిగా దర్శనం. ముదురు బంగారు రంగు వస్త్రం, కదంబం ప్రసాదాన్ని నివేదిస్తారు.

5వ: శ్రీచండీ దేవిగా కొలుస్తారు. భవానిమాతగా దర్శనం, ఎర్రని వస్త్రం, ప్రసాదంగా చింతపండు పులిహోర, రవ్వకేసరి.

6వ: శ్రీమహాలక్ష్మిగా దర్శనం. ముదురు గులాబీ రంగు వస్త్రం, పూర్ణం బూరెలు ప్రసాదం.

7వ: శ్రీసరస్వతి దేవిగా దర్శనం. తెల్లని వస్త్రం, నైవేద్యంగా దద్దోజనం.

8వ: దుర్గాష్టమి, మహా దుర్గాలంకరణ, ఎర్రని వస్త్రం, ప్రసాదంగా నిమ్మకాయ పులిహోర.

9వ రోజు: మహానవమి, మహిషాసుర మర్దిని అలంకరణ, ఆకుపచ్చని వస్త్రం, చక్కెర పొంగలి ప్రసాదం.

విజయదశమి: విజయదశమి పర్వదినం రోజు అమ్మవారికి సామ్రాజ్య పట్టాభిషేకం, ఎరుపు, ఆకుపచ్చ రంగు వస్త్రాలు సమర్పిస్తారు. లడ్డూలు, పులిహోర, రవ్వకేసరి నైవేద్యం.

అయ్యో పాపం.. ఎంత కష్టం..

● పెళ్లైన ఐదు నెలలకే యువతికి రెండు కిడ్నీల్లో సమస్య

● డయాలసిస్‌తో సాగుతున్న జీవనం

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి: కూతురుకు స్తోమతకు తగినట్లు పెళ్లి జరిపించారు. బాధ్యత తీరిందనుకున్నారు ఆ అమ్మానాన్న.. ఎన్నో ఆశలతో కొత్త కాపురానికి వెళ్లింది.. మెట్టినింట్లో భర్తతో ఆనందంగా సాగిపోతోంది జీవితం.. ఇంతలోనే పిడుగు లాంటి వార్త.. నవ వధువుకు రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని వైద్యులు చెప్పడంతో రెండు కుటుంబాలు తీరని విషాదంలో మునిగిపోయాయి. ఆ యువతి జీవన్మరణ పోరాటం చేస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన కోడూరి అనూషకు ఏడాది కిందట బంధువుల అబ్బాయితో వివాహమైంది. ఆయన హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. పెళ్లయిన ఐదు నెలలకు ఒకరోజు అనూషకు తీవ్రమైన జ్వరం వచ్చింది. వైద్యులు పరీక్షించి రెండు కిడ్నీలు పనిచేయడం లేదని నిర్ధారించారు. కొద్దిరోజుల్లోనే మరింత అనారోగ్యానికి గురయ్యింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోజు విడిచి రోజు డయాలసిస్ చేయిస్తున్నారు. మందులకు, డయాలసిస్‌కు రెండు కిడ్నీల మార్పిడికి వైద్యుల సూచనలతో ఇప్పటి వరకు రూ.5 లక్షలు అప్పు చేసి ఖర్చు చేశారు. రూ. 11 లక్షల వరకు ఖర్చు చేశామని కుటుంబ సభ్యులు తెలిపారు. అనూష కిడ్నీ మార్పిడి, శస్త్ర చికిత్సలకు దాదాపు మరో రూ. 10 లక్షలకు పైగానే ఖర్చవుతాయని తెలిపారు.. రోజూ వ్యవసాయ కూలీ పనులు చేసుకుని బతికే తమకు అంత ఖర్చు భరించే స్తోమత లేదని, ఇప్పటికే అప్పులు చేసి వైద్యం అందిస్తున్నామని తండ్రి సైదయ్య పేర్కొన్నారు. దాతలు ఆదుకుంటేనే బిడ్డ దక్కుతుందని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం, దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న అనూష

● దాతలు సహాయం చేయదల్చుకుంటే చరవాణి నంబర్లు 85209 63145, 99129 42026 కి సంప్రదించాలి.

గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య

● ఏకలవ్య ఆశ్రమ పాఠశాల భవనాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని



జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

కొత్తగూడ, న్యూస్‌టుడే: కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలో రూ.40కోట్లతో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాల(ఈఎంఆర్‌ఎస్) నూతన భవనాన్ని బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ ఝార్ఖండ్‌లోని హజారీబాగ్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. వెనుకబడిన గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు నెలకొల్పిన వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రారంభ శిలాఫలకాన్ని పీవో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యున్నత ప్రమాణాలతో రూ.40కోట్ల వ్యయంతో ఈ ఆశ్రమ పాఠశాలను నిర్మించినట్లు తెలిపారు. ఇప్పటికే ఈ గురుకులంలో 500 మంది గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీయడానికి అత్యుత్తమైన బోధన అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో అలివేలు, జడ్పీ సీఈవో నర్సింహ, ఆరేసీవో హరిసింగ్, మండల ప్రత్యేకాధికారి సురేష్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో రవీంద్రప్రసాద్, గురుకుల ప్రిన్సిపల్ అజయ్‌సింగ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు (కిలో/ వెల రూపాయల్లో)		
వెన్‌కాబ్	ఫారంరేట్: 110	డ్రెస్: 191
	రిటైల్: 132	స్కిన్‌లెస్: 218

పేదల బతుకులపై పిడుగు

● ముగ్గురి మృతితో విషాదం

● ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే

వర్షాకాలం పిడుగుపాటు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. బుధవారం ఉమ్మడి వరంగల్‌లో ముగ్గురు మృత్యువాత పడటం విషాదాన్ని మిగిల్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయపల్లి గ్రామానికి చెందిన మహిళ రైతు కె.లక్ష్మి (45) మిరప తోటకు పిండి చల్లుతున్న క్రమంలో పిడుగు పడటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌలపల్లి గ్రామంలో వ్యవసాయ కూలీలు నిర్మల (51), రమ (45) అదే గ్రామానికి చెందిన రైతు పొలంలో పత్తి ఏరి ఇంటికి వచ్చే క్రమంలో పిడుగుపాటుకు గురై ప్రాణాలు కోల్పోయారు. కూలీ పనికి వెళ్తే తప్ప పూట గడవని ఆ పేద కుటుంబాలు తీరని దుఃఖంలో మునిగిపోయాయి. పట్టణాలు, పల్లెలు ఎక్కడైనా పిడుగులు పడే అవకాశముంటుందని వాతావరణ శాఖ నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

అపార్ట్‌మెంట్లూ అతీతం కాదు

చాలా మంది అపార్ట్‌మెంట్లపై పిడుగు పడదన్న భ్రమలో ఉంటారు. అలాంటిదేమీ లేదని, రానున్న రోజుల్లో పిడుగుల ముప్పు మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు. ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టం నివారించవచ్చని చెబుతున్నారు. వరంగల్ నగరంలో 1000కి పైగా అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వాటి సంఖ్య వేగంగా పెరుగుతోంది. పిడుగుల బారిన పడకుండా సరైన భద్రతా చర్యలు తీసుకోవడం లేదు.



● ఆరు నెలల కిందట హనుమకొండ నగరంలోని గాంధీనగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌పై పిడుగుపడటంతో పెచ్చుకంగా దెబ్బతింది.



గాంధీనగర్‌లోని ఓ భవనంపై ఏర్పాటు చేసిన లైట్నింగ్ కండక్టర్

నిబంధనలను పాటించాలి

ఎత్తైన భవనాలు, చెట్లు పిడుగులను ఎక్కువగా ఆకర్షిస్తాయి. అందువల్ల భవన నిర్మాణ సమయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ప్రతి ఎత్తైన భవనంపై తప్పనిసరిగా లైట్నింగ్ కండక్టర్లు ఏర్పాటు చేసుకోవాలి. దీనిలో పొడవాటి రాగి, ఇత్తడి తీగను భవనం పైభాగాన అమర్చాలి. దానికి ఎర్త్ కనెక్షన్ ఇచ్చుకోవాలి. దీనికి విద్యుత్తును ఆకర్షించే శక్తి ఉంటుంది. ఇది పిడుగు ప్రభావం భవనంపై పడకుండా అడ్డుకుంటుంది. చాలామందికి ఇది చిన్న ఏర్పాటే కావొచ్చు. వేల వోల్టుల విద్యుదావేశాన్ని రాగి కడ్డీ ఆకర్షించి ఎర్త్ కనెక్షన్ ద్వారా భూమిలోకి పంపేస్తుంది.

ఇదీ కారణం..

క్యుములో నింబస్ మేఘాలు ఏర్పడిన సమయంలో తీవ్రమైన గాలులు, ఉరుములు, మెరుపులు వస్తుంటాయి. పిడుగు పడిన ప్రాంతంలో ఏర్పడిన బుగ్గి కావడంతో కొన్ని లక్షల ఓల్టుల విద్యుత్తు తరంగాలు మేఘాల నుంచి భూమిలోకి ప్రవహిస్తాయి. నీటి ఆవిరితో ఉన్న మేఘాలు ఒక్కదానికొకటి తాకడం వల్ల విద్యుత్తు పుడుతుంది. ఈవిద్యుత్తే పిడుగుల రూపంలో భూమిపై పడి ప్రాణ, ఆస్తి నష్టానికి కారణమవుతున్నాయి.

కేయూ ఉప కులపతి ఎవరో?

● రేపు సెర్చ్ కమిటీ సమావేశం

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం 15వ ఉపకులపతిని నిర్ణయించడం కోసం ఈ నెల 4న సెర్చ్ కమిటీ సమావేశం కానుంది. 14వ ఉప కులపతిగా బాధ్యతలు నిర్వహించిన సామాజికశాస్త్ర విశ్రాంత ఆచార్యులు తాటికొండ రమేశ్ పదవీకాలం ఈ ఏడాది మే 21న ముగిసింది. ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారి వాకాటి కరుణను ఇన్‌ఛార్జి ఉప కులపతిగా నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా పలు వర్సిటీలకు ఉపకులపతులు లేకపోవడంతో కొత్తవారిని నియమించడం కోసం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కేయూ వీసీ నియామకం కోసం జేఎన్‌టీయూ విశ్రాంత ఆచార్యులు ఆకుల వెంకట రమణ (ప్రభుత్వ నామిని), జమ్ము విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సంజీవ్ జైన్ (యూజీసీ నామిని), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి (ప్రభుత్వ నామిని)లతో సెర్చ్ కమిటీని నియమించారు.

158 మంది పోటీ..: విశ్వవిద్యాలయ ఉప కులపతి పదవిని దక్కించుకునేందుకు కోసం రాష్ట్రంలోని పలు వర్సిటీలు, విద్యా పరిశోధన సంస్థల నుంచి పలువురు పోటీపడుతున్నారు. మును పెన్నడూ లేనివిధంగా తీవ్రమైన పోటీ నెలకొంది. 158 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో కేయూ ఆచార్యులు నలుగురు బరిలో ఉన్నారు. ప్రస్తుత రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి (గణిత విభాగం), దూరవిద్య కేంద్రం సంచాలకులు వి.రామచంద్రం (రాజనీతిశాస్త్రం), టి.యాదగిరిరావు (ప్రభుత్వ పాలనా శాస్త్రం), టి.శ్రీనివాస్ (సామాజికశాస్త్రం)లు పదవిని ఆశిస్తున్నారు.

8 మంది విశ్రాంత ఆచార్యులు..: కేయూలో 30 ఏళ్లపాటు బోధన, పరిశోధన, పరిపాలన సేవలను అందించిన ఆరుగురు విశ్రాంత ఆచార్యులు కూడా దరఖాస్తు చేసుకున్నవారిలో ఉన్నారు. వీరిలో జి.దయాకర్, వి.రవీందర్ (రసాయనశాస్త్రం), కె.పురుషోత్తం (ఆంగ్లం), ఎం.ఆశోక్‌కుమార్, వెంకటనారాయణ (అర్థశాస్త్రం), బి.వలయ్య (తెలుగు), టి.శ్రీనివాసరావు (వాణిజ్యశాస్త్రం), సి.హెచ్ దినేష్‌కుమార్ (రాజనీతిశాస్త్రం)లు దరఖాస్తు చేసుకున్నారు.

14న దరఖాస్తుల పరిశీలన..: ఈ నెల 4న రాష్ట్ర సచివాలయంలో సెర్చ్ కమిటీ సమావేశం కానుంది. దరఖాస్తు చేసుకున్న ఆచార్యుల, విద్యావేత్తల బయోడేటాలను పరిశీలిస్తుంది. బోధన, పరిశోధన, పాలన అనుభవాలను పరిగణలోకి తీసుకుంటుంది. అత్యంత ప్రతిభ కలిగిన ముగ్గురి పేర్లతో జాబితాను గవర్నర్‌కు అందజేస్తారు. అందులో నుంచి ఒకరిని కేయూ ఉప కులపతిగా నియమిస్తారు. ప్రక్రియ సజావుగా సాగితే 15 రోజుల్లో కేయూకు కొత్త వీసీ రానున్నారు.

డెంగీ లక్షణాలతో విద్యార్థిని మృతి

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: డెంగీ లక్షణాలతో విద్యార్థిని మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలో ఉప్పరపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం దేవేందర్, రమ దంపతుల కుమార్తె కల్యాణి(22) హైదరాబాద్ అమీర్‌పేటలో ఉంటూ ఓ కోచింగ్ సెంటర్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం శిక్షణ తీసుకుంటోంది. ఆమెకు కొన్ని రోజుల క్రితం జ్వరం రావడంతో స్వగ్రామానికి వచ్చింది. హనుమకొండలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా డెంగీ వచ్చినట్లు వైద్యులు నిర్ధారించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.



కల్యాణి (పాత చిత్రం)

ఒక్కేసి పువ్వేసి సందమామ..!





మంగపేట మండల కేంద్రంలో..



కమలాపురం గ్రామంలో..



పస్రా గ్రామంలో..



ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను జిల్లా వ్యాప్తంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి తమ నేర్పరితనాన్ని చాటుకున్నారు. బతుకమ్మల మధ్యలో గౌరమ్మను ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఉదయమే ఇళ్లలో బతుకమ్మలను సిద్ధం చేసి పూజా కార్యక్రమాలను పూర్తి చేసుకున్నారు. సాయంత్రం వేళ ఉత్సవాలకు ఆడంబరంగా బయలుదేరారు. దేవాలయాల ప్రాంగణంలో ఆట పాటలతో, కోలాటాలతో అలరించారు. - న్యూస్‌టుడే, యంత్రాంగం



తరలివస్తున్న యువతులు, చిన్నారులు



వెంకటాపూర్



క్రాస్‌రోడ్డులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మహిళలతో కలిసి వస్తున్న ములుగు మాజీ ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి



గుమ్మడిదొడ్డి గ్రామంలో



బతుకమ్మ ఆడేందుకు వస్తున్న మహిళలు



గోవిందరావుపేట గ్రామంలో తరలివస్తున్న మహిళలు



ఏటూరునాగారం పట్టణంలో



శివాలయంలో



రామాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



వాజేడు మండలం చీకుపల్లిలో



తాడ్వాయిలో..



వెంకటాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140

ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

జాతీయ పోటీలకు కోచ్ ఎంపిక



కుమారస్వామి

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని దిల్లీ పబ్లిక్ పాఠశాలలో ఈ నెల 3 నుంచి 7 వరకు నిర్వహించనున్న 38వ సబ్ జూనియర్స్ నేషనల్స్ హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలకు ఏటూరునాగారం పట్టణానికి చెందిన కోచ్ పర్వతాల కుమారస్వామి టెక్నికల్ అఫీషియల్‌గా ఎంపికైనట్లు తెలంగాణ హ్యాండ్ బాల్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ తెలిపారు. జిల్లా యువజన, క్రీడల అధికారి తుల రవి, పలువురు ఈ సందర్భంగా కుమారస్వామిని అభినందించారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



విజేతలతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ తుషార ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెస్(అండర్-15 విభాగం) పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సాయంత్రం జరిగిన ముగింపు వేడుకలకు కాకతీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు పద్మజ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 102 మంది బాలబాలికలు హాజరయ్యారని పోటీల నిర్వాహక కార్యదర్శి కన్నా తెలిపారు.

ఆర్థిక సాయం

మంగపేట, న్యూస్‌టుడే: మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న మద్దెల పాపారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం మృతుడి కుటుంబాన్ని ల్యాబ్ టెక్నీషయన్లు పరామర్శించి రూ.12,500 ఆర్థిక సాయం అందజేశారు. శ్రీనివాస్, చంద్రశేఖర్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మత్తులో వాహనాలను నడిపితే కఠిన చర్యలు

వెంకటాపురం, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై కొప్పుల తిరుపతిరావు హెచ్చరించారు. వెంకటాపురం-వాజేడు మార్గంలోని ఎంపీడీవో కార్యాలయం సమీప ప్రధాన రహదారిపై తనిఖీలను నిర్వహించారు. మత్తులో తూలుతున్న పలువురు వాహనాలను విచ్చలవిడిగా నడుపుతున్నట్లు పోలీసుల దృష్టికి వెళ్లింది. దీంతో పలువురు వాహనదారులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు. మద్యం మత్తులో వాహనాలను నడిపితే మీ ప్రాణాలకు భద్రత లేకపోవడంతో పాటు ఇతరులకు ప్రాణహాని ఉంటుందని సూచించారు.

ఇంకెన్నాళ్లు భరించాలి



వెంకటాపురం శివారులో నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు

వెంకటాపురం, న్యూస్‌టుడే: దుమ్ము, దూళీతో ఇంకెన్నాళ్లు భరించాలంటూ గ్రామస్థులు కన్నెర్ర చేశారు. ఇసుక లారీల రవాణాకు తోడు అసంపూర్తి పనులను నిరసిస్తూ.. వెంకటాపురం మండల కేంద్రం శివారులో యువకులు బుధవారం ఆందోళన చేపట్టారు. వాహనాలను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. రహదారి నిర్మాణ బాధ్యులను నిలదీశారు. దుమ్ము నుంచి కాపాడుకునేందుకు తామే రోడ్డును తడుపుకోవాల్సి వస్తుందని మండిపడ్డారు. ఇసుక లారీలను తిప్పకుండా చూస్తే.. రోడ్డు పనులను పూర్తి చేస్తామంటూ రహదారి నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న గుత్తేదారు వ్యక్తులు వ్యాఖ్యానించడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏళ్లుగా నిర్లక్ష్యం చేసి ఇప్పుడు కొత్త సాకులు చెప్పడమేంటని ప్రశ్నించారు. 30 నిమిషాలకు పైగా రవాణా స్తంభించింది. సమాచారం మేరకు ఎస్సై కొప్పుల తిరుపతిరావు సంఘటనా ప్రాంతానికి చేరుకుని నిరసనకారులతో చర్చించారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

కాంగ్రెస్ నాయకుడికి అంగరక్షకుల తొలగింపు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకుడు, మంత్రి కొండా దంపతుల ప్రధాన అనుచరుడు, మాజీ రౌడీషీటర్ నవీన్‌రాజ్‌కు అంగరక్షకులను తొలగించారు. ఇటీవల వరంగల్ పోలీసు డివిజన్‌లో నవీన్‌రాజ్ వ్యవహారం వివాదాస్పంగా మారింది. దీంతో ఆయనకున్న అంగరక్షకులు ఉంచాలా.. వద్దా? అనే అంశాలపై విచారణ జరిపిన పోలీసులు అవసరం లేదని నిర్ధారించుకున్న తర్వాత తొలగించారు. బుధవారం ఆ అంగరక్షకులు పోలీసు కమిషనరేట్ ఏఆర్ విభాగంలో రిపోర్టు చేశారు. ప్రస్తుతం వరంగల్ తూర్పులో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

పోలీసుల అదుపులో నిందితులు?

మట్టెవాడ, న్యూస్‌టుడే: వరంగల్ నగరంలో జరిగిన యువతిపై సామూహిక అత్యాచారం ఘటనలో నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. బాధిత యువతి పోలీసులకు తెలిపిన వివరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన ఇంతేజార్‌గంజ్ ఠాణా పోలీసులు పరారీలో ఉన్న మరో యువకుడిని అదుపులోకి తీసుకున్నారని విశ్వసనీయంగా తెలిసింది. ఈ ఘటనపై లాడ్జి నిర్వాహకులను పోలీసులు తీవ్రంగా మందలించారు. పూర్తిస్థాయి వివరాలు తీసుకోకుండా గది ఇవ్వడంలో సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్లు తేల్చారు. యువకుల అరెస్టుకు సంబంధించి గురువారం పోలీసులు విలేకరుల సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. ఈ విషయంపై ఇంతేజార్‌గంజ్ పోలీసులను వివరణ కోరగా.. స్పందించలేదు.

ఇసుక లారీలను నియంత్రించాలని వినతి



ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం మండల కేంద్రంలో ఇసుక లారీలను నియంత్రించాలని మండల కాంగ్రెస్ నాయకులు ఎస్సై తాజుద్దీన్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. భద్రాచలం, మణుగూరు ప్రాంతాల నుంచి వస్తున్న ఇసుక లారీలను వరంగల్, నర్సంపేట రహదారుల వైపు తరలించాలని, ఇల్లందు, చర్ల నుంచి వస్తున్న వాటిని భద్రాచలం మీదుగా వరంగల్, హనుమకొండ తరలించి వాహనాల రద్దీ లేకుండా చూడాలన్నారు. నిత్యం ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని నియంత్రించాలన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, ఖలీల్‌ఖాన్, గుడ్ల దేవేందర్, ఎండీ.సలీం, ముక్కెర లాలయ్య, సులేమాన్, వావిలాల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి..



ములుగులో నివాళులర్పిస్తున్న భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, పార్టీ శ్రేణులు



మంగపేట ఎమ్మార్సీ కార్యాలయంలో



ఏటూరునాగారం పట్టణంలో ఆర్యవైశ్యులు



నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



వేడుకల్లో పాల్గొన్న ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

శాంతి మార్గమే పోరాట మార్గమని నిరూపించిన మహనీయుడు మహాత్మా గాంధీ అని వక్తలు పేర్కొన్నారు. బాపూజీ చూపిన మార్గంలో నడవాలన్నారు. ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన సేవలను కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా సంఘాలు, వివిధ పార్టీ కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

– న్యూస్‌టుడే, యంత్రాంగం



గోవిందరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో



అకినేపల్లి మల్లారంలో జాతీయ మిర్చిటాస్క్ ఫోర్స్ కమిటీ డైరెక్టర్ సాంబశివరెడ్డి



మేడారం గిరిజన మ్యూజియంలో..



వెంకటాపూర్ మండలంలో..



వెంకటాపురం రెవెన్యూ కార్యాలయం వద్ద



పీహెచ్‌సీలో వైద్యాధికారి మధుకర్, వైద్య సిబ్బంది



ములుగు పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు



ములుగులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో

వాజేడులో రెవెన్యూ అధికారులు, సిబ్బంది



హనుమాన్ కూడలిలో కాంగ్రెస్ నాయకులు

అభివృద్ధి, వసతుల కల్పనే లక్ష్యం

కాటారం, న్యూస్‌టుడే: ఈ ప్రాంత అభివృద్ధి, మెరుగైన వసతుల కల్పనే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించి నివాళి అర్పించారు. ప్రజలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలనే ఆలోచనతో దేశానికి స్వాతంత్య్రం తీసుకొచ్చిన మహనీయుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు. తొమ్మిదేళ్లుగా ఈ ప్రాంతం అభివృద్ధికి నిలయంగా ఉండేది. పార్టీ నాయకులు, నాయకత్వం లేకుండా చేసే ప్రయత్నం చేసినా గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలనే ప్రయత్నంతో మార్పు కోసం రాజ్యాంగబద్ధంగా ప్రజలు తమకు అవకాశం ఇచ్చారని తెలిపారు. డివిజన్ పరిధిలో వంద మంది చొప్పున మహిళలను ఎంపిక చేసి శిక్షణ అందించి కాటారం ప్రాంతంలో సుమారు రూ.5 కోట్ల పరిశ్రమ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ నివేదిక సిద్ధం చేస్తున్నామని, కాటారం ప్రభుత్వ శిక్షణ సంస్థ రూ.4 కోట్లతో త్వరలోనే భవన నిర్మాణం ప్రారంభించి ఉపాధికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆదివాసీ బిడ్డకు ఆర్థిక సాయం



ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం మండలంలోని బూటారం గ్రామానికి చెందిన కుడుముల సాత్విక అనే ఆదివాసీ బిడ్డ ఎంబీబీఎస్‌లో ప్రభుత్వ కోటాలో సీటు సాధించినా.. ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయని, 'ఈనాడు'లో అక్టోబర్ 2న 'ఆదివాసీ బిడ్డకు ఆర్థిక కష్టాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన బ్రాహ్మణ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సాత్వికకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నల్లబోయిన సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి పూసం లక్ష్మీనారాయణ, కార్యదర్శులు పోదెం ప్రసాద్, దబ్బకట్ల సుధాకర్, వల్లెం రాంబాబు, నల్లబోయిన రాంచందర్, నారాయణ, మధుసూదన్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు కథనానికి స్పందన

పిచ్చి మొక్కల తొలగింపు



ములుగు టౌన్, న్యూస్‌టుడే: ములుగు పట్టణంలోని ఎస్పీ కార్యాలయం వెనకాల ఉన్న విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న పిచ్చి మొక్కలను విద్యుత్తు శాఖ సిబ్బంది తొలగించారు. కరెంటు సరఫరాలో అప్పుడప్పుడు అంతరాయం కలుగుతుండటం, వీధి దీపాలు చుట్టుముట్టడంతో రాత్రి పూట వెలుతురు రాకపోవడంతో ఈ ప్రాంతంలో తిరుగలేకపోతున్నామని ఈ నెల 2వ తేదీన 'ఈనాడు'లో 'స్తంభం చుట్టూ పిచ్చిమొక్కలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేసి తీగలను తొలగించి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు స్వాధీనం



పస్రా (గోవిందరావుపేట), న్యూస్‌టుడే: గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలోని రామప్పపట్నం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం రెండు వ్యాన్లలో అక్రమంగా తరలిస్తున్న పశువులను పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. వ్యాన్లలో ఉన్న పశువులను భూపాలపల్లి సమీపంలోని రాంపూర్ గోశాలకు తరలించామన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా పశువులను తరలించేందుకు ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్రగాయాలు

వెంకటాపురం, ఏటూరునాగారం, న్యూస్‌టుడే: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వెంకటాపురం మండలంలో బుధవారం పట్టణంలోని వేప చెట్టు కేంద్రం సమీపంలో ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో పాత్రాపురానికి చెందిన శివారెడ్డి, శారదానగర్‌కు చెందిన మడకం రామారావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో వెంకటాపురం సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవలకు భద్రాచలం పంపించారు.

★ వెంకటాపురం మండలంలోని రామచంద్రాపురం గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడటంతో లక్ష్మీనగరం బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన ఉద్యోగి నాగరాజుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో వెంకటాపురం తరలించారు.

★ ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన కొండపల్లి రాజన్న ఏటూరునాగారం వచ్చి తన స్వగ్రామానికి మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఆటోనగర్ కాలనీ సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. అదుపుతప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో రాజన్నకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

పరిసరాల శుభ్రతకు యువత చొరవ చూపాలి

వాజేడు, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వాజేడు మండలం మొరుమూరు పంచాయతీ పరిధిలోని యువతీ, యువకులకు ఆటలపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ప్రగళ్లపల్లిలో ఏర్పాటు చేసిన మొరుమూరు పంచాయతీ గ్రామసభలో ప్రత్యేకాధికారి అర్జున్ అబ్బాస్ ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో చేపట్టిన విధంగా గ్రామాల్లోని పరిశుభ్రతను ఉంచేందుకు యువత చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కార్తీక్, యువతీయువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



విజేతలతో మొరుమూరు పంచాయతీ ప్రత్యేకాధికారి, గ్రామస్థులు

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మహబూబాబాద్‌లోని ఓ వేడుక మందిరంలో ఏర్పాటుచేసిన జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 52 సంవత్సరాలుగా పీఆర్‌టీయూ ఉపాధ్యాయులకు చేస్తున్న సేవలను వివరించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముందుగా జిల్లా కార్యదర్శి సతీష్‌రెడ్డి కార్యదర్శి నివేదిక వినిపించారు.